క్లుప్తంగా

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: ప్రజలకు తాగునీటిటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని గట్టెపల్లి మానేరు వాగులో కౌన్సిలర్లతో కలిసి నూతనంగా చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. వర్షాలు అధికంగా పడ్డ సందర్భాల్లో పైప్‌లైన్ ధ్వంసం కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు అనేక సందర్భాలలో శాశ్వత పైప్‌లైన్ చేపట్టాలని కోరడంతో శాశ్వతంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ విషయం ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పూర్తిస్థాయిలో శాశ్వతంగా మంచినీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్లు కూకట్ల గోపి, గాజుల లక్ష్మి, రాయమల్లు, అనుమల అరుణ, బాబురావు పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్డుపై వేసే వారిపై చర్యలు



పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: వ్యర్థాలను రోడ్డుపై వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. శనివారం పట్టణంలోని మెయిన్ రోడ్‌లో తీస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ప్రజలు, షాపుల యజమానులు ఇష్టానుసారంగా చెత్తను, చికెన్ వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారని, అలా వేస్తే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, చెత్తను వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని ఆయన కోరారు. చెత్తను రోడ్లపై వేసే వారికి రూ.2వేలు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్, జావాన్ ఆనంద్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి విద్యార్థుల చేయూత



నగదు అందిస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు దివ్యాంగుల ఆశ్రమానికి చేయూత అందించారు. మంథని డివిజన్ దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీకి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు విరాళాల రూపంలో రూ.57వేలు సేకరించారు. ఈ నగదును శనివారం సొసైటీ సభ్యులకు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ అందజేశారు. గతంలో కరోనా సమయంలోను గోదావరిఖనిలోని దివ్యాంగుల సొసైటీకి తమవంతు చేయూత అందించామని, భవిష్యత్‌లో కూడా ఇలాగే అనాథ, వృద్ధాశ్రమ నిర్వాహకులకు తమవంతు సహకారం అందిస్తామని ఇస్మాయిల్ పేర్కొన్నారు.

పెద్దపల్లిలో విద్యుత్ మీటర్ల తనిఖీ

పెద్దపల్లిరూరల్: పట్టణంలో శనివారం ఇళ్లకు అమర్చిన విద్యుత్‌మీటర్లను ప్రత్యేక బృందాలతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ మీటర్లకు ఉండాల్సిన లోడ్, వినియోగిస్తున్న లోడు పరిశీలించి వచ్చే వేసవి కాలంలో సరఫరాలో సమస్య ఏర్పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ బొంకూరి సుదర్శనం తెలిపారు. పట్టణంలో 9,660 విద్యుత్ మీటర్లను తనిఖీ చేయగా అందులో గృహ అవసరాల కోసం కనెక్షన్ పొంది వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లుగా గుర్తించి 269 మందికి నోటీసులు అందించామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.7.20లక్షలు వసూలు కావాలని వెల్లడించారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్ కావాల్సిన వారు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వరిపంటకు మొగి తెగుళ్లు

ఓదెల: మండలంలో వరిపంటకు మొగితెగుళ్లు సోకాయి. మండలంలోని గోపరపల్లె, ఉప్పరపల్లె, కొలనూర్, హరిపురం, కొత్తపల్లి, మూలసాల గ్రామాల్లో వరిపంటకు మొగితెగుళ్ల సోకటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లు వేసిన అనంతరం వాతావరణంలో మార్పులు రావటంతో వరిపంటకు మొగిరోగం రావటంతో ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పట్టించుకొని నివారణ చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాలకు స్పందన



జ్యోతినగర్: దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది



ఎలిగేడు: తనిఖీ చేస్తున్న తహసీల్దార్ స్వర్ణ



రామగుండం: భరత్‌నగర్‌లో పోలింగ్ బూత్..

జ్యోతినగర్: ఓటరు నమోదు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలకు మంచి స్పందన కనిపించింది. శనివారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీ రావూస్ స్కూల్‌లోని 50వ పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు అందుబాటులో ఉండేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో మంచి స్పందన కనిపించింది. కృష్ణానగర్, నర్రాశాలపల్లె, ఆటోనగర్, ఇందిరమ్మకాలనీతో పాటు జ్యోతినగర్ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో బూత్ లెవల్ అధికారి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు అందుబాటులో ఉండి సేవలందించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో జనవరి1నాటికి 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణ కోరారు. శనివారం మండలంలోని గ్రామ, గ్రామాన నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎలిగేడులో 261, 263, 264 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సందర్శించి తనిఖీ చేశారు. 21న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ఉంటుందని తెలిపారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

సుల్తానాబాద్: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి కోరారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌వోల ద్వారా నిర్వహించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొక్కుబడిగా ఓటరు నమోదు

రామగుండం: పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు నూతన ఓటర్లను ఓటరు జాబితాలో నమోదు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం బీఎల్‌వోలు సేకరించిన సమాచారాన్ని ఓటరు జాబితాలో చేర్చకపోవడంపై అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే పోలింగ్ కేంద్రం సంఖ్య 234లో ఓటరు క్రమ సంఖ్య 674 బడికెల రాజమ్మ అనే వృద్ధురాలు మృతి చెంది రెండేళ్లు అవుతున్నా ఓటరు జాబితాలో ఆమె పేరు ఇంకా దర్శనమిస్తుండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

జూలపల్లి: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో శనివారం 24 ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెంకట్రావుపల్లె, కాచాపూర్ గ్రామాల్లో నమోదు కేంద్రాలను పరిశీలించి బీఎల్‌వోలకు తగిన సూచనలు చేశారు.

మేథమెటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



పెద్దపల్లిరూరల్: ప్రశంసపత్రాలతో విద్యార్థులు



ముత్తారం: ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



సుల్తానాబాద్: విద్యార్థులతో ఉపాధ్యాయులు



మంథని: ప్రశంసపత్రం అందుకుంటున్న శ్రీనిధి



కాల్వశ్రీరాంపూర్‌లో..



గోదావరిఖనిటౌన్: విద్యార్థికి ప్రశంసాపత్రం

రామగుండం/మంథని/ముత్తారం/పాలకుర్తి/కమాన్‌పూర్/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్/ఓదెల/గోదావరిఖనిటౌన్: తెలంగాణ మేథమెటిక్స్ ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శనివారం మండల స్థాయి మేథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించి అభినందనలు తెలిపారు.

టూటీఎంసీ పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీతో నీట మునిగిన పంటపొలాలు

రామగిరి: లొంకకేసారంలో టూటీఎంసీ పైపులైన్ లీకేజీ అవడంతో నీరంతా పంట పొలాల్లోకి వెళ్లింది. గుండారం రిజర్వాయర్ నుంచి శుక్రవారంపేట 2టీఎంసీ సాగునీరు అందించే పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి పంటలు మునిగిపోతున్నాయని రైతులు కల్వచర్ల సర్పంచ్ గంట పద్మ దృష్టికి తీసుకెళ్లారు. డీఈఈకి సమాచారం అందించడంతో నీటి సరఫరా నిలిపివేశారు. నీట మునిగిన పంట పొలాలకు పరిహారం చెల్లించాలని సర్పంచ్ కోరారు.

సంక్షిప్త వార్తలు

✦ రేపు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

గోదావరిఖనిటౌన్: ఈ నెల 22న సోమవారం అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట పర్వదినం సందర్భంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్ ఒక ప్రకటనలో కోరారు.

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమాన్‌పూర్: మండల కేంద్రంతో పాటు రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు. మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

✦ మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ

గోదావరిఖనిటౌన్: వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో స్వయం ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 45 రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్స్‌తో 89777 48838 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే అనుభవజ్ఞులైన శిక్షకుల నుంచి కూడా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

✦ ఆలయంలో స్వచ్ఛభారత్

జ్యోతినగర్: అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఆలయం పరిశుభ్రం చేశా రు. శనివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్‌రోడ్ సమీపంలోని ఆంజనేయ స్వా మి ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టా రు. మాజీ కార్పొరేటర్ సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్, కేఎస్ఎన్ రావు, కిషన్‌రావు పాల్గొన్నారు.

✦ లింగ వివక్ష లేకుండా చూడాలి

సుల్తానాబాద్: బాల బాలికలను లింగవివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉర్దూ మీడియం ఉపాధ్యాయురాలు శ్రీమతి సపూర తబస్సుం, శ్రీమతి శాహిదా తబస్సుం, అన్నారు. శనివారంసుల్తానాబాద్ పట్టణం లోని ఉర్దు మీడియం పాఠశాలలో శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రధాన థీమ్ మీటింగ్ ఇంపార్టెన్స్ ఆఫ్ గర్ల్ చైల్డ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

✦ ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం

కోల్‌సిటీ: గోదావరిఖని రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఫొటోగ్రాఫర్ ఎండీ.షర్ఫొద్దీన్‌కు శనివారం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.6,050 ఆర్థికసాయం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, శనిగరపు మల్లేశ్, బండారి ప్రసాద్, తోకటి శ్రీధర్, గూడెల్లి శ్రీనివాస్, రెడ్డి శ్యాంప్రసాద్ ఉన్నారు.

✦ ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

పెద్దపల్లిరూరల్: జైశ్రీరాం నామస్మరణలతో ప్రదర్శనగా ఇంటింటికీ అయోధ్య అక్షింతలను పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో శనివారం పంపిణీ చేశారు. అర్చకులు శ్రీనివాసమూర్తితో పాటు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు అక్షింతలు అందజేశారు.

✦ పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: స్పెల్ విజార్డ్ డ్రామా కాంపిటీషన్స్ 22వ తేదీ నుంచి స్కూల్ లెవల్ పోటీలు నిర్వహించనున్నట్లు రామగుండం హైస్కూల్ హెచ్‌ఎం.అజ్మీరా శారద తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రాంగణంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జనవరి 22న స్కూల్ స్థాయి, 29న మండలస్థాయి, జిల్లా స్థాయి ఫిబ్రవరి 19న, రాష్ట్ర స్థాయి పోటీలు 26న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయులు ఎం.లక్ష్మీనారాయణ, రమేశ్, సాయికృష్ణ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ టీవీ ప్రారంభం

రామగిరి: మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం లెర్నింగ్ ఇంటరాక్టివ్ ప్యానల్ (డిజిటల్ టీవీ)ని సర్పంచ్ పల్లె ప్రతిమ ప్రారంభించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానెల్ మంజూరైందని సర్పంచ్ తెలిపారు. పాఠశాలలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల బహుమతి ప్రదానానికి విశ్వేశ్వర యూత్ సభ్యులు రూ.5వేలు అందజేశారు.

✦ కళాజాత ప్రదర్శన

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలలో ఓటరు నమోదు, పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ మాదకద్రవ్యాలపై కళాజాత నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు శనివారం ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్‌గౌడ్, ఢిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, స్పందన, స్వప్న, శ్వేత, ఉప్పు స్పందన పాల్గొన్నారు.

✦ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా తిమోతి

గోదావరిఖనిటౌన్: టీఎస్ ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా యాసర్ల రాజ్‌కుమార్ అలియాస్ తిమోతిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన నియామకాన్ని ప్రకటించారు.

చలితీవ్రతతో మామిడిపూత ఆలస్యం



పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఉద్యానశాఖ అధికారి

ధర్మారం: చలితీవ్రతతో మామిడిలో పూత ఆలస్యం అవుతోందని, తగిన చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని రామగిరిఖిలా శాస్త్రవేత్త భాస్కర్‌రావు అన్నారు. చామనపల్లి, కొత్తూరు, కటికెనపల్లిలోని మామిడితోటలను శనివారం ఉద్యానశాఖ అధికారి జ్యోతితోపాటు శాస్త్రవేత్త భాస్కర్‌రావు సందర్శించారు. ప్రస్తుతం చెట్లకు కొంతవరకే పూత వచ్చిందని, 3కిలోల పొటాషియం నైట్రేట్‌ను 500 లీటర్ల నీటితో కలిపి చెట్టు తడిచేలా పిచికారీ చేస్తే పూర్తిస్థాయిలో పూత వస్తుందన్నారు. చెట్లకు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలని సూచించారు. రైతులు కారుపాకల రాజయ్య, రేండ్ల నరేశ్, ఓదేశ్, గంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–4 సివిక్ కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే 22వ జీవోను అమలు చేయాలని కోరారు. గట్టయ్య, పోచం, విజయ, సుగుణ, సమ్మయ్య, శంకరమ్మ, విజయలక్ష్మి, రవీందర్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను వినియోగించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సుల్తానాబాద్: ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్‌ను వినియోగించుకోవాలని గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో వికాసి భారత్ సంకల్ప అవగాహన సదస్సు నిర్వహించారు. బీమా సురక్ష, బీమా యోజన ద్వారా రూ.2లక్షల ఇన్సూరెన్స్ లభిస్తుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికాసి భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ప్రచార రథంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా పథకాల వీడియోలను ప్రజలు తిలకించారు. డాక్టర్లు శ్రీజ, ఉదయ, సింధూజ, నోడల్ అధికారి హరికృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జాడి బాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గజబీంకార్ పవన్, గుడ్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీతోనే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్జీ–2 ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎండీ అక్రమ్ అన్నారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల హక్కులను సాధించడం కోసం కార్మికుల పక్షాన ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తామని తెలిపారు. ఈనెల 5న సింగరేణి సీఎండీని కలిసి గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, పోషయ్య, కృష్ణ, దశరథం గౌడ్, ప్యారేమియా, ప్రసాద్, సైదులు, అవినాష్, ఖజా అలీ, ప్రవీణ్‌కుమార్, మసూద్ అలీ, నటరాజ్, అశోక్‌రెడ్డి, సల్మాన్ పాల్గొన్నారు.

ట్రినిటిలో ముందస్తు అయోధ్య ఉత్సవాలు



వివిధ వేషధారణలో చిన్నారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ప్రైమరీ స్కూల్‌లో శనివారం అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ట ముందస్తు ఉత్సవాలు నిర్వహించారు. సీతారాములు, లక్ష్మణ, హనుమంతుడి వేషధారణలో చిన్నారులు అలరింపజేశారు. మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి పాల్గొన్నారు.

22న జీవహింస జరగకుండా చూడండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోల్‌సిటీ: అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట జరగనున్న నేపథ్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 22వ తేదీన జీవహింస జరగకుండా చూడాలని అధికారులను శనివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు కోరారు. ఈ మేరకు కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాణప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా మూగజీవులను వధించకుండా, మాంసాహారం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు అయోధ్య రవీందర్, మ్యాడగోని రవీందర్, అడిగొప్పుల రాజు, కందుగుల ఆకాష్‌కుమార్, పొనగంటి శశికాంత్, ఎరుకల సుధీర్ ఉన్నారు.

కనీస వేతనాల జీవోను వెంటనే సవరించాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

సుల్తానాబాద్: కనీస వేతనాల జీవోను ప్రభుత్వాలు వెంటనే సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు పదేళ్ల నుంచి కనీస వేతన జీవో సవరించకుండా పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. రైస్‌మిల్లు కార్మికుల వేతనాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వమైన కనీస వేతనాల జీవోలను సవరించి నెలకు రూ.26వేల వేతనంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించాలని, చట్టం ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు కట్టెకోల రాజు, అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, నాయకులు నౌండ్ల బ్రహ్మచారి, పూసాల సంపత్, బండారి స్వామి, బండారి తిరుపతి, వెంకటేశ్, శేఖర్, శంకర్, రాజమౌళి, తిలక్, రవీందర్, రాజేశం పాల్గొన్నారు.

జాతరలో చిరు వ్యాపారాల నిర్వహణకు వేలం



వేలంలో పాల్గొన్న చిరు వ్యాపారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి నది ఒడ్డున ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క జాతరలో చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు శనివారం గోలివాడ రామాలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. కాగా 2022 జాతరలో వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో పోల్చితే గణనీయంగా పెరిగింది. జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు తమ పూర్తి డబ్బులను ఫిబ్రవరి ఐదోతేదీలోగా ఈవో రాజ్‌కుమార్‌కు చెల్లించాలని సూచించారు. సకాలంలో డబ్బులు చెల్లించని వారి వేలం రద్దు చేసి రీ టెండర్ ప్రకటిస్తామని తెలిపారు. గత జాతరలో వేలంలో వ్యాపారం కై వసం చేసుకున్న వారి నుంచి బకాయిలు రావాల్సి ఉండగా ఎప్పుడు వసూలు చేస్తారంటూ కమిటీ సభ్యుడు రామ్మూర్తిగౌడ్ కొంతసేపు ఈవోతో వాగ్వాదానికి దిగారు. వేలంలో సర్పంచ్ ధర్ని రాజేశ్, జాతర కమిటీ వైస్ ప్రెసిడెంట్ చెన్న విష్ణు, ప్రధాన కార్యదర్శి పల్లికొండ తిరుపతి, కార్యదర్శి ఆవుల గోపాల్‌యాదవ్, రామ్మూర్తిగౌడ్ పాల్గొన్నారు.

ఓదెల నుంచి అయోధ్యకు 200మంది భక్తులు

ఓదెల: మండలం నుంచి రామమందిరం దర్శనం కోసం అయోధ్యకు 200మంది భక్తులు తరలివెళ్లనున్నట్లు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రం ఓదెలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓదెల, సుల్తానాబాద్ ప్రాంతాల నుంచి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22న అయోధ్య దర్శనం కోసం కాజీపేట్ నుంచి ప్రత్యేక రైళ్లద్వారా ప్రయాణం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బోరు మోటార్ పునరుద్ధరణ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ దళిత కాలనీకి చెందిన బోర్ మోటారు చెడిపోయి మూడు నెలలైనా పునరుద్ధరించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని దళితులు వాపోయారు. శుక్రవారం దళిత కాలనీవాసులు అధికారుల వైఖరిపై పాడయిన బోర్ బావి వద్ద నిరసన తెలిపారు. స్పందించిన ఎంపీడీవో యాదగిరి, కార్యదర్శి మానస శనివారం బోరు బావి మోటారును పునరుద్ధరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

కాల్వశ్రీరాంపూర్: మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కోడిగుడ్లకు పెరిగిన ధరలు చెల్లించాలని ఆ యూనియన్ సభ్యులు శనివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. పెరిగిన ధరలతో విద్యార్థులకు సరుకులు కొనలేక పోతున్నామని, పెండింగ్ బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. యూనియన్ సభ్యులు లక్ష్మి, రాజేశ్వరి, మధునమ్మ, ఎల్లమ్మ, స్వరూప, కొమురమ్మ, యశోద, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా:
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899